# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **గణతంత్ర వేడుకల సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి, సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.**

**2.** **76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.**

**3.** **ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని.. స్వర్ణాంధ్ర విజన్ సాధనకు అడుగులు వేస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ వెల్లడించారు.**

**4.** **వచ్చే నెల రెండవ వారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు జరగనుంది.**

**5.** **గత జూలై నుంచి డిసెంబరు వరకు మంత్రుల పనితీరుపై నివేదికలు పంపాలని ప్రభుత్వ శాఖలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.**

=========================

దేశవ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి మారుమూల గ్రామాల వరకు త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. ఈ ఏడాది గణతంత్ర వేడుకలను 'స్వర్ణమయ భారత్– వారసత్వం, వికాసం' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఢిల్లీలో జరిగిన వేడుకల్లో . బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సైనిక కవాతులో త్రివిధ దళాలు సత్తా చాటాయి.

-------------------------

గణతంత్ర వేడుకల సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్రివిధ దళాలు సంయుక్తంగా ఒక శకటాన్ని తీసుకురావడం ఈసారి వేడుకల ప్రత్యేకత. వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల శకటాలు ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

-------------------------

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగాన్ని రూపొందించి.. ప్రజాస్వామ్యం, గౌరవంతో పాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా కృషి చేసిన మహనీయులందరికీ ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నానని అన్నారు. ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుందని, బలమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నానని ప్రధానమంత్రి ఎక్స్‌లో పేర్కొన్నారు.

---------------------------

దేశ ప్రజలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం భారత రాజ్యాంగ విలువలపై విశ్వాసం, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్యంపై అంకితభావానికి చిహ్నమని పేర్కొన్నారు. బలమైన గణతంత్రానికి పునాది వేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలకు నివాళులర్పిస్తున్నానని చెప్పారు. ఈ 76వ గణతంత్ర దినోత్సవం నాడు అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిర్మించడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేద్దామని అమిత్‌షా పిలుపునిచ్చారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని గవర్నర్ వివరిస్తూ..

...వాయిస్.. 30 సెకన్లు

---------------------------

గుంటూరు జిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గణతంత్ర వేడుకలను నిర్వహించారు. గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. శాసనసభలో సభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం... స్వేచ్ఛ, సమానత్వం, ఓటుహక్కు కల్పించిందని, సమైక్య స్ఫూర్తిని, రాజ్యాంగ విలువల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

సచివాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. హైకోర్టులో గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆవిష్కరించారు.

---------------------------

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పయనించేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని తెలియజేశారు.

---------------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశసేవకు ప్రజలంతా పునరంకితం కావాల్సిన తరుణమిదని, స్వాతంత్ర్యం కోసం బలిదానం చేసిన వారిని స్మరించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంత్యోదయ స్ఫూర్తిగా అడుగులు వేస్తున్నారని మధుకర్ జీ వివరించారు.

---------------------------

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి జాతీయ జెండాను ఎగరవేశారు.

---------------------------

వచ్చే నెల రెండవ వారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రెండుసార్లు జిల్లాల కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్ల సదస్సులు జరిగాయి. ఈ సారి 36 ప్రభుత్వ శాఖల అధికారులు జిల్లాల సమాచారంతో ముందుగానే ప్రజెంటేషన్లు తయారు చేస్తారు. వీటిని సదస్సు నిర్వహణకు కనీసం వారం ముందు జిల్లాల కలెక్టర్లకు పంపుతారు. వీటిల్లోని సమాచారం ఆధారంగా మాట్లాడేందుకు కలెక్టర్లకే ఎక్కువ సమయం ఇవ్వనున్నారు. ఈ సదస్సు జరగడానికి కొద్దిరోజుల ముందు.. ప్రభుత్వశాఖల అధిపతులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమై కలెక్టర్ల సదస్సులో ఏయే అంశాలపై చర్చించాలో  సమీక్షిస్తారు.

---------------------------

గత జూలై నుంచి డిసెంబరు వరకు మంత్రుల పనితీరుపై నివేదికలు పంపాలని ప్రభుత్వ శాఖలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. మంత్రులు పాల్గొన్న అధికారిక కార్యక్రమాలు, శాఖాపరంగా అమల్లోకి తెచ్చిన సంస్కరణలు, ఇతర నిర్ణయాల అమలు, పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలు, తదితర సమాచారాన్ని ఆరు నమూనాల ద్వారా ప్రభుత్వం కోరింది. ఒకే మంత్రి పర్యవేక్షిస్తున్న శాఖలు ఒకటి కంటే ఎక్కువగా ఉంటే అందుకు తగినట్టు విడివిడిగా సమాచారాన్ని పంపించాలని సూచించింది. వీటి ఆధారంగా మంత్రుల పనితీరును ప్రభుత్వం మదింపు చేయనుంది.

---------------------------

ఏలూరు జిల్లాలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏపీ జెన్‌కో జలవిద్యుత్తు కేంద్రాల సంచాలకులు సుజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యుదుత్పత్తి కేంద్రంలో 2026 నాటికి రెండు యూనిట్లు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో సీలేరు జలాశయం, రెగ్యులేటరీ డ్యాం, పార్వతీనగర్‌లో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మించనున్న స్థలాన్ని నిన్న ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి జాతీయ జలవిద్యుత్తు సంస్థ..ఎన్‌హెచ్‌పీసీ, ఏపీ జెన్‌కో మధ్య అంగీకారం కుదిరిందని తెలిపారు.

=====================